

చోరీ ముఠా గుట్టురట్టు

బడా కన్‌స్ట్రక్షన్లు, ఫామ్‌హౌస్‌ల వద్ద సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ చేసే ముఠా ఆటకట్టించారు చేవెళ్ల పోలీసులు. 8లో▸



'రైతు భరోసా'కు కార్యాచరణ

రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸



టిప్పర్ ఢీకొని బాలుడి మృతి

టిప్పర్ ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్దలో చోటు చేసుకుంది. 8లో▸

జలుబు దగ్గుకూ మందుల్లేవ్!



ఆరోగ్య కేంద్రాల్లో తీవ్ర కొరత

- నొప్పి నివారణ, కడుపు ఉబ్బరం మందులు సైతం
- ఇండెంట్ పంపినా.. సరఫరా కాని వైనం
- నగంతో నరిపెడుతున్న వైద్య సిబ్బంది

సాక్షి, రంగారెడ్డి జిల్లా : ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఖరీదైన మందులే కాదు..దగ్గు, జలుబు, నొప్పి నివారణ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం పొందే సాధారణ మందులు సైతం వీటిల్లో దొరకడం లేదు. వనస్థలిపురం, కొండాపూర్ ఏరియా ఆస్పత్రులు మొదలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయి అధికారులు మందుల కోసం ఇండెంట్ పంపినా..సరఫరా కాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఫార్మసిస్టులు చేతులెత్తేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, మందుల సరఫరాపై ఆరా తీయాల్సిన అధికారులు.. పట్టించుకోక పోవడం, వైద్యులు కూడా ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం కొరతకు ప్రధాన కారణం.

రాంటాక్, పాంటాక్ టాబ్లెట్లు కరువే..

ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. చలిగాలులు వీస్తుండటంతో అనేక మంది వివిధ రకాల ఫ్లూ బారినపడుతున్నారు. దగ్గు, జలుబుతో పాటు జ్వరం, తలనొప్పి, కడుపు ఉబ్బరం, వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు. పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు పొందొచ్చనే భావనతో మెజార్టీ పేదలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు చేరుకుంటారు. జిల్లాలో 39 ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఒక్కో ఆస్పత్రి అవుట్ పేషంట్ విభాగానికి రోజుకు సగటున 20 నుంచి 30 మంది వస్తుంటారు. వీరిలో సాధారణ జ్వరాలు, ఫ్లూతో బాధపడే చిన్నారులతో పాటు మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి బాధితులు ఉంటారు. వైద్యులు రోగులను పరీక్షించి, మందులు రాస్తున్నారు. డాక్టర్ రాసిన మందుల చీటీ తీసుకుని ఫార్మసిస్ట్ వద్దకు చేరుకుంటే తీరా అక్కడ వారికి చేదు అనుభవమే ఎదురవుతోంది. ఖరీదైన మందులే కాదు సాధారణ జలుబు నివారణకు వాడే సీపీఎం, నొప్పుల నివారణకు వాడే రాంటాక్, పాంటాక్ వంటి మందులు దొరకడం లేదు.

అనవసర మందులే అధికం

ప్రభుత్వం తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా జిల్లాకు 432 రకాల మందులను సరఫరా చేస్తుంది. అయితే మందుల కొనుగోలు, సరఫరాపై సరైనా నిఘా లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగుల అవసరాలకు భిన్నంగా అనవసర మందులు కొనుగోలు చేస్తూ.. గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. తీరా గడువు ముగిసిన తర్వాత వాటిని గుట్టుగా బయటికి తరలిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య వ్యర్థాల్లో ఈ మందులను కలిపి పారబోస్తుండగా, మరికొన్ని చోట్ల గుట్టుగా నిర్మానుష్య ప్రాంతాలకు తరలించి, దగ్ధం చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.కోటి విలువ చేసే 170 రకాల మందులు కాలం చెల్లినవిగా గుర్తించినట్లు తెలిసింది. ఆయా సరఫరా కంపెనీలకు తిప్పి పంపినట్లు స్టోర్స్ అధికారులు చెప్పుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

విధిలేని పరిస్థితుల్లో రోగులే వీటిని ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

ఫార్మాసిటీనా.. ఫోర్త్ సిటీనా..

- కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్

కందుకూరు: గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కొనసాగిస్తుందా లేక ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయనుందా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. కోర్టుకు మాత్రం ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారని, బయట మాత్రం ఫోర్త్ సిటీ అంటున్నారని.. ఏదో ఒకటి తేల్చాలన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీస్ బందోబస్తు మధ్య రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ రహదారికి భూసేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలోనే ఫార్మాసిటీలోకి చేరుకునేలా నేరుగా రోడ్డు నిర్మించామని, చుట్టూ అన్ని వైపుల నుంచి అక్కడికి చేరుకునేలా కనెక్టివిటీ ఉందన్నారు. మళ్లీ 330 అడుగుల రహదారితో అవసరమేమిటని నిలదీశారు. రియల్ వ్యాపారం కోసం తప్ప మరొకటి కాదన్నారు. కేసీఆర్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల, మహేశ్వరం, కందుకూరును కొత్తగా మున్సిపాలిటీలు చేయాలనుకుంటోందని, దీంతో ప్రజలకు నష్టం ఏర్పడుతుందన్నారు. ఇంటి పన్ను, నల్లా పన్నులు పెరుగుతాయని, ఉపాధి పనులు నిలిచిపోతాయన్నారు. భూముల విలువలు పెంచుకోవడానికే మున్సిపాలిటీలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. 11 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని. మళ్లీ ప్రజా పాలన విజయోత్సవాలు ఎందుకన్నారు. జీపీలకు నిధులు కేటాయించలేదని, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో పంచాయతీలు ఉన్నాయన్నారు. చెత్త సేకరించే ట్రాక్టర్లకు డీజిల్ పోయించలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరదేవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ, రామకృష్ణారెడ్డి, పి.ఆనంద్, సామ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బీసీలు ఐకమత్యంగా ముందుకు సాగాలి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

నందిగామ: బీసీలు ఇప్పటి నుంచి మౌనం వీడాలని, ఐకమత్యంతో సత్తా చాటాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం బీసీ సేన అసెంబ్లీ అధ్యక్షుడు మెక్కొండ నరేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బర్క కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలు రోజురోజుకూ వెనకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐకమత్యంతో ఉంటే ఏ శక్తీ ఏమీ చేయలేదని, అన్ని రాజకీయ పార్టీలు బీసీ జపం చేయాల్సిన అనివార్య పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం బీసీ సేన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాఘవేందర్ చారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, నాయకులు సతీష్, గిరిరామ్, చందర్, శివ కుమార్ చారి, మల్లేష్ యాదవ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

లోక్‌మంథన్‌లో షాద్‌నగర్ విద్యార్థుల నాటక ప్రదర్శన



షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని శిల్పారామంలో సాంప్రదాయ కళావేదికపై లోక్‌మంథన్ విశ్వ కళా ప్రదర్శనను నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ కళా ప్రదర్శనకు వివిధ దేశాల నుంచి కళాకారులు హాజరయ్యారు. సోమవారం ముగింపు సందర్భంగా జాతీయ సాంస్కృతిక సంస్థ విభాగ్ తరపున షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థులు మాకూ స్వాతంత్య్రం కావాలి నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో వర్షిణి, వైష్ణవి, యోగిత, వేదశ్రీ, స్వచిత్ర, యస్విత, జ్యోషిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. చిన్నారుల హావభావాలు, అభినయం, కళా ప్రదర్శనకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. కుటుంబ విలువల నేపథ్యంలో సాగిన ప్రదర్శన కట్టిపడేసింది. ప్రతి చిన్నారి తమ పాత్రను చక్కగా పోషించి పలువురి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాటక రచయిత, దర్శకుడు టీవీ రంగయ్య, సంస్కారభారతి జాతీయ సాంస్కృతిక సంస్థ ముఖ్య సలహాదారు బెజుగం రమేష్, గౌరవ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి శివ, సింగారం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

క్రిస్మస్ సత్కారాలకు నామినేషన్ల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన క్రైస్తవులను సత్కరించడం జరుగుతుందని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజికరంగం, విద్య, వైద్యం, సాహిత్యం, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని ప్రభుత్వం సత్కరిస్తుందన్నారు. ఆయా రంగాల్లో కనీసం ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం ఆదర్శప్రాయమైన సేవలందించిన సంస్థలు, వ్యక్తుల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం లోపు కలెక్టర్ కాంప్లెక్స్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు 040–23391067 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌జీవీ షాద్‌నగర్‌లో ఉన్నట్టు పుకార్లు

షాద్‌నగర్‌రూరల్: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ షాద్‌నగర్‌లో ఉన్నట్టు సోమవారం పుకార్లు షికార్లు చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఏపీ పోలీసులు వర్మపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్‌జీవీ ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ ప్రాంతంలోని కమ్మదనంలో సినీనటుడు ప్రకాష్‌రాజ్ ఫాంహౌస్‌లో తలదాచుకున్నారనే వదంతులు వ్యాపించాయి. దీనిపై స్థానిక పోలీసులను సంప్రదించగా అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన అర్జీలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమ వారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. మొత్తం 52 అర్జీలు రాగా, వీటిలో 42 రెవెన్యూ సంబంధితమైనవేనని చెప్పారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి దరఖాస్తులపై డిసెంబర్ 9న సమీక్ష ఉంటుందని చెప్పారు. సమగ్రకుటుంబ సర్వే డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

హుడాకాంప్లెక్స్: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి సంధ్యారాణి అన్నారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, వీల్‌చైర్, ట్రై సైకిల్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 500 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకల్యం లక్ష్యసాధనకు అడ్డు కాదని, ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

'జనరల్'కు ప్రాధాన్యం!

- రైల్వే ప్రయాణికులకు భారీ ఊరట
- అన్ని ప్రధాన రైళ్లలో నాలుగు జనరల్ బోగీలు
- గోదావరి, గౌతమి, దానాపూర్, దక్షిణ్, నిజాముద్దీన్ తదితర రైళ్లలో పెంపు
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు



సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బోగీల పెంపుతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పుడు ఉన్న రెండు సాధారణ(జనరల్) బోగీలకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రైల్వేబోర్డు తాజాగా నిర్ణయించింది. డిసెంబర్‌లోనే దశలవారీగా బోగీల విస్తరణ కొనసాగనుందని దక్షిణమధ్య రైల్వే అధికారి ఒకరు తెలిపారు. దీంతో ప్రయాణికులకు పెద్ద ఎత్తున ఊరట లభించనుంది. సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు దానాపూర్‌కు రాకపోకలు సాగించే దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు రద్దీ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు వారణాసి తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు కూడా ఈ ట్రైన్‌పైనే ఆధారపడి బయలుదేరుతారు. రిజర్వేషన్ బోగీల్లో బెర్తులు లభించని ప్రయాణికుల నుంచి కూడా సాధారణ బోగీలకు డిమాండ్ ఉంటుంది. 75 మంది కూర్చొని ప్రయాణం చేసేందుకు అవకాశం ఉన్న ఒక సాధారణ బోగీలో కనీసం 150 మంది వరకు కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం మరో 2 బోగీలు అదనంగా ఏర్పాటు చేయడం వల్ల దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ఊరట లభించనుంది. త్వరలోనే అదనపు బోగీలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెప్పారు. నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరే సుమారు 60 రైళ్లకు కూడా అదనపు బోగీ లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

లక్షన్నర మంది సాధారణ ప్రయాణికులే..

నగరంలోని మూడు ప్రధాన స్టేషన్‌లనుంచి ప్రతి రోజు సుమారు 2.8 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణం చేసేవారు మినహాయిస్తే కనీసం లక్షన్నర మంది సాధారణ ప్రయాణికులే. లక్ష మందికే సదుపాయం ఉన్న బోగీల్లో మరో 50 వేల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఏ సమయంలో చూసినా జనరల్ బోగీలు కిక్కిరిసి కనిపిస్తాయి. ప్రయాణం నరకప్రాయంగా ఉంటోంది. నించునేందుకు కూడా చోటులేక చాలామంది మరుగుదొడ్ల పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తారు. ఫుట్‌బోర్డులపై కూర్చుంటారు. ఇలా రకరకాలుగా ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. అదనపు బోగీలను ఏర్పాటు చేయడం వల్ల ఇప్పుడు ఉన్న డిమాండ్‌లో కనీసం 75 శాతం వరకు భర్తీ అయ్యే అవకాశం ఉంటుంది. 'సాధారణ బోగీల పెంపు కోసం చేపట్టిన ప్రయాణికుల ఉద్యమం ఫలించింది. ట్విట్టర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రయాణికుల సంఘాలు విజయవంతమయ్యా'యని ఉత్తర తెలంగాణ రైల్వే ప్రయాణికుల సంఘం ప్రతినిధి ఫణి తెలిపారు. పూర్తిగా సాధారణ బోగీలు లేని ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు 2 సాధారణ బోగీలు ప్రవేశ పెడతారు. మరో 2 అదనంగా ఏర్పాటు చేస్తారు.

ఈ రైళ్లకు బోగీల పెంపు...

- నాంపల్లి నుంచి న్యూఢిల్లీకి నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నాంపల్లి నుంచి నిజాముద్దీన్ ఢిల్లీకి రాకపోకలు సాగించే దక్షిణ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, సికింద్రాబాద్ నుంచి దానాపూర్ (పాట్నా) వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు కానున్నాయి.
- సికింద్రాబాద్- రాయ్‌పూర్ బైవీక్లీ, సికింద్రాబాద్- హిస్సార్ ట్రై వీక్లీ, నాంపల్లి- రక్సల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ , నాంపల్లి- విశాఖపట్నం గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నాంపల్లి – తాంబరం చెన్నై చార్మినార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏర్పాటు చేయనున్నారు.
- సాధారణ ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉండే లింగంపల్లి –కాకినాడపోర్ట్ గౌతమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ , సికింద్రాబాద్ –గూడూరు సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం బోగీలు పెరగనున్నాయి.
- హుస్సేన్ సాగర్, ఫలక్ నుమా, దేవగిరి, నారాయణాద్రి, విజయవాడ ఇంటర్ సిటీ, సికింద్రాబాద్–సాయినగర్ షిర్డీ అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ సూపర్ ఫాస్ట్, కాచిగూడ–మంగళూరు , కాచిగూడ–మధురై హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు జత చేస్తారు.
- నాగ్‌పూర్ –సికింద్రాబాద్ 8 చైర్‌కార్ మరోవైపు నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బోగీలను తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం 20 చైర్ కార్‌లు ఉన్నాయి. ఆక్యుపెన్సీ చాలా తక్కువగా ఉంది. దీపావళి సెలవుల్లో మాత్రం 110 శాతం ఆక్యుపెన్సీతో ఈ ట్రైన్ నడిచింది. సాధారణంగా నిత్యం 25 నుంచి 30 శాతం ఆక్యుపెన్సీ కంటే పెరగడం లేదు. ఈ రూట్‌లో 8 చైర్‌కార్ ట్రైన్ నడిపాలని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

ఇక ఫుడ్ సేఫ్టీ కమిటీలు!

- జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా కేజీబీవీ వసతి గృహాల్లో అమలు
- కమిటీల్లో జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు సహా విద్యార్థులకు స్థానం
- మధ్యాహ్న భోజనంపై మరింత నిఘా
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వార్డెన్లపై చర్యలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ స్కూళ్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఆయా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని నిర్ణయించింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు నాసిరకం భోజనం అందజేస్తున్న విషయం తెలిసిందే. రుచి పచిలేని ఈ ఆహారాన్ని తినలేక విద్యార్థులు ఖాళీకడుపుతో పస్తులుంటున్న విషయం తెలిసిందే. ఇకపై ఏ ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి భావించారు. ఈ మేరకు వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిల్లో ప్రత్యేక డైట్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం సహా వసతి గృహాల్లో కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న కాయగూరలు, పండ్లు, పాలు, కోడిగుడ్లు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించనున్నారు. జిల్లాస్థాయి కమిటీలో డీఈఓ, జిల్లా పౌరసరఫరాల అధికారి, డీఎంసీఎస్‌లు సభ్యులుగా కొనసాగుతారు. మండల స్థాయి కమిటీలో ఎంపీడీఓ చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులు ఉంటారు. మున్సిపాలిటీ స్థాయిల్లోనూ ఈ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కమిటీల్లో అధికారులతో పాటు విద్యార్థులను కూడా భాగస్వాములను చేయనున్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందజేసి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

హాస్టళ్లపై నిరంతర నిఘా

జిల్లాలో 1309 ప్రభుత్వ పాఠశాలలు, 20 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు 6,027 మంది విద్యార్థులు ఉన్నారు. మరో 11 ఇంటర్మీడియట్ కేజీబీవీల్లో 1,176 మంది చదువుతున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని 14 వసతి గృహాల్లో 2,212 మంది, ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 34 ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 3000 మంది వసతి పొందుతున్నారు. మరో 16 కళాశాల వసతి గృహాల్లో 1,805 మంది వసతి పొందుతున్నారు. ఇక మైనార్టీ సంక్షేమశాఖ అధ్వర్యంలో తొమ్మిది గురుకులాలు, తొమ్మిది జూనియర్ కాలేజీలు కొనసాగుతుండగా వాటిలో 8,900 మంది చదువుతున్నారు. వీరికి మూడు పూటలా ఉదయం టిఫిన్ (రోజుకో వెరైటీ), మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం వడ్డించాలి. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో వార్డెన్లు కుమ్మక్కై..నాసిరకం ఆహారాన్ని వడ్డిస్తున్నారు. సన్న బియ్యానికి బదులు దొడ్డు బియాన్ని వాడుతున్నారు. అది కూడా ముద్దకట్టి, ముక్క వాసన వస్తుండంతో విద్యార్థులు తినలేక పోతున్నారు. పప్పు నీళ్లను తలపిస్తుంది. చీడపీడలు పట్టి పుచ్చిపోయి, వాడిపోయిన కాయగూరలను వడ్డిస్తున్నారు. రోజుకో గుడ్డు చొప్పున వారానికి ఏడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా, మెజార్టీ హాస్టళ్లలో మూడే ఇస్తున్నారు. ప్రతి ఆదివారం చికెన్/మటన్ వడ్డించాల్సి ఉన్నా..చేయడం లేదు. ప్రతి రోజు ఒక్కో విద్యార్థికి గ్లాసు పాలు ఇవ్వాల్సి ఉండగా, వాటిని వార్డెన్లు, వంట సిబ్బందే కాజేస్తున్నారు. డైట్ కమిటీల నిరంతర తనిఖీల ద్వారా పరిస్థితి మెరుగుపరచవచ్చునని భావిస్తుంది. అంతేకాదు కాయగూరలు, ఇతర ఆహార పదార్థాల నిల్వ కోసం దాతల సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. ప్లాస్టిక్ డబ్బాలు, టేబుళ్ల కొనుగోలు చేయించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని యోచిస్తోంది.



సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్

మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలను రూ.950 నుంచి రూ.1,350కి పెంచింది. అదే విధంగా ఎనిమిది నుంచి పది వరకు రూ.1,100 నుంచి రూ.1,540కి పెంచింది. కాస్మొటిక్ ఛార్జీల్లో భాగంగా సబ్బులు, నూనెలకు (బాలుర)కు రూ.150 చెల్లిస్తుంది. బాలికలకు 3 నుంచి 7 తరగతి వరకు రూ.150, ఎనిమిది నుంచి పది వరకు రూ.200 వరకు చెల్లిస్తుంది. వీటితో పాటు ఒక్కో విద్యార్థికి నాలుగు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్, బెడ్‌షీట్, కార్పెట్, ఉలన్ రగ్గులు, ప్లేట్లు అందజేస్తుంది. మంచాలు, డైనింగ్ టేబుల్, లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. అయితే ఆయా వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వార్డెన్లు..వంట సిబ్బంది, అటెండర్‌కు ఆ బాధ్యతలను అప్పగించి వెళ్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. డైట్ ఛార్జీలు పెంచినా.. విద్యార్థుల మెనూలో మార్పు రాకపోవడం ఇటీవల హాస్టళ్ల తనిఖీలకు వెళ్లిన కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ డైట్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నిరంతర నిఘాతో మెనూలో మార్పులు తీసుకురావొచ్చునని ఆయన భావిస్తున్నారు.

దొంగకు రిమాండ్


నిందితుడు స్వామి

కందుకూరు: ఓ మహిళ మెడలో నుంచి నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించిన దొంగను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవెల్లి సమీపంలో మేకలు మేపడానికి వెళ్లిన జంగమ్మ మెడలోంచి ఆదివారం బైక్‌పై వచ్చిన దొంగ, నకిలీ బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోగా మార్గమధ్యలో బేగంపేట గ్రామస్తులు అతన్ని అడ్డుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. కాగా నిందితుడిని ఖమ్మం జిల్లా మధిర మండలం, మాడుపల్లి గ్రామానికి చెందిన గ్యారపాటి స్వామి(37)గా గుర్తించారు. ఈ మేరకు సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.

‘రైతు భరోసా’కు కార్యాచరణ


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, వెంకటేశ్‌గుప్తా, గీత తదితరులు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రైతు భరోసా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆమనగల్లు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ముద్వీన్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తుంది అన్నారు. ఇప్పటికే సన్నాలకు రూ.500 బోనస్ అందజేస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం ముద్వీన్ గ్రామస్తులు ఎక్వాయిపల్లి నుంచి ముద్వీన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు రాములుగౌడ్ నరేశ్‌నాయక్, హన్మానాయక్, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, అశోక్, మధు, వినోద్, గోపాల్, నర్సింహగౌడ్, జహంగీర్‌అలీ, మార్కెట్, సింగిల్‌విండో డైరెక్టర్లు శ్రీశైలం, అజీం, నరేశ్‌నాయక్, వెంకటయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, ,సుమన్, మల్లేశ్, జంగయ్య, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఈఓలు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం ఆయన కాంగ్రెస్ ముద్వీన్ గ్రామ అధ్యక్షుడు మధు నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ శ్రేణుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆరాతీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు.

పడునెట్టాంబడి పూజకు ఆహ్వానం

డిసెంబర్ 2న నిర్వహించనున్న అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజా కార్యక్రమానికి గురుస్వామి బిక్కునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వాములు ఎమ్మెల్యేను సత్కరించి, ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, శేఖర్‌గౌడ్, జగన్, లక్ష్మణ్‌నాయక్, ప్రభులింగం తదితరులు ఉన్నారు.

సెంట్రింగ్ బాక్స్‌ల చోరీ ముఠా గుట్టురట్టు

శివారు ప్రాంతాల్లోని సైట్లే లక్ష్యం

- రూ.25లక్షల విలువైన 48 టన్నుల సెంట్రింగ్ బాక్స్‌లు అపహరణ
- 18 మంది ముఠాలో ఎనిమిది మంది అరెస్ట్
- పరారీలో పదిమంది
- కేసు వివరాలు వెల్లడించిన సీఐ భూపాల్ శ్రీధర్, డీఐ రమేశ్‌నాయుడు


పోలీసుల అదుపులో నిందితులు, రికవరీ చేసిన సెంట్రింగ్ బాక్సులు

చేవెళ్ల: శివారు ప్రాంతాల్లో చేపట్టే బడా కన్‌స్ట్రక్షన్‌ల వద్ద, ఫామ్‌హౌస్‌ల వద్ద సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ చేసే ముఠా ఆటకట్టించారు చేవెళ్ల పోలీసులు. ఈ ముఠా ఆరు నెలలుగా చేవెళ్ల ప్రాంతంలో 11 కేసులకు సంబంధించి రూ.25లక్షల విలువ చేసే 48 టన్నుల సెంట్రింగ్ బాక్స్‌లను చోరీ చేసింది. 18 సభ్యులున్న ఈ ముఠానాయకుడితో పాటు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి 43 టన్నుల సెంట్రింగ్ బాక్స్‌లను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు విచారణకు కస్టడీకి తీసుకోగా ముఠా గుట్టు రట్టయింది. సోమవారం కేసు వివరాలను చేవెళ్ల ఠాణాలో సీఐ భూపాల్ శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి వెల్లడించారు.

ముఠా నాయకుడికి ముగ్గురు అనుచరులు

హైదరాబాద్‌లోని ముషీరాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన మోసిన్‌అహ్మద్‌కు స్క్రాప్ దుకాణం ఉంది. యూపీకి చెందిన కూలీలతో సంబంధాలు పెట్టుకుని 18 మందితో ఓ ముఠాగా ఏర్పడి సెంట్రింగ్ బాక్స్‌ల చోరీకి పాల్పడుతున్నారు. ఎ-1 మోసిన్ అహ్మద్‌కు ప్రధాన అనుచరులుగా యూపీకి చెందిన అల్తాఫ్ హుస్సేన్, ఇమ్రాన్, అఖిల్ బాజ్‌పేయి ఉంటున్నారు. వీరు యూపీకి చెందిన ఇతర కూలీ పనులు చేసుకుంటూ వేర్వేరు ప్రాంతాల్లో ఉండే వారితో మాట్లాడి ఎంపిక చేసిన చోట రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతుంటారు. కూలీకి వచ్చిన వారికి వాహనాల ఏర్పాటు, వారికి డబ్బులు ఇచ్చే పనులు ఈ ముగ్గురు అనుచరుల్లో ఎవరో ఒకరు చూసుకుంటారు. చోరీ చేసిన సెంట్రింగ్ బాక్స్‌లను అనుచరుల్లో ఒకరు నార్సింగ్ వద్ద మోసిన్ అహ్మద్‌కు అప్పగిస్తారన్నారు. అతడు వాటిని తీసుకెళ్లి ముషీరాబాద్‌లో వేరే వారికి సెంకడ్ హ్యాండ్ మాల్ అని అమ్మేస్తుంటాడని చెప్పారు. ఇలా ఈ ముఠా ఆరు నెలలుగా రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ తదితర అనేక జిల్లాల్లో సెంట్రింగ్ బ్యాక్స్‌ల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన వారిలో ముఠానాయకుడు మోసిన్ అహ్మద్, ఎండీ రహమాన్, ఎండీ అర్బాజ్, ఎండీ అయాజ్, గుసావ్ అలీ, ఖలీమొద్దీన్. అన్సర్ అలీ, ఎండీ షకీల్‌లు ఉన్నట్లు తెలిపారు. మరో పది మంది నిందితులు పరారీలో ఉన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ భూపాల్ శ్రీధర్, డీఐ రమేశ్ నాయుడు. ఎస్ఐలు

నిందితులను పట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికులు రిజ్వాన్, హైమద్, సాదత్‌లు ఈనెల 8న మండల పరిధిలోని ముడిమ్యాల సమీపంలో ఫామ్ హౌస్‌లలో సెంట్రింగ్ పనులకు వేసిన డబ్బాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో వీరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అప్పటికే సెంట్రింగ్ డబ్బాలు చోరీకి గురైన కేసులు నమోదు అయ్యాయి. అన్ని శివారు ప్రాంతాల్లో ఉండడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఫిర్యాదు చేసిన బాధితులు మరోచోట సెంట్రింగ్ పనులకు డబ్బాలు వేసి ఉంచారు. ఈ నెల 9న ముడిమ్యాల మరో చోట సెంట్రింగ్ బాక్స్‌ల చోరీకి ఏడుగురు ముఠా సభ్యులు వచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన బాధితులు రిజ్వాన్, హైమద్, సాదత్ చోరీ చేస్తున్నవారిని పట్టుకుని పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఏడుగురిని పట్టుకుని విచారించగా ముఠానాయకుడు మోసిన్ అహ్మద్ పేరు చెప్పడంతో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అప్పటికే చేవెళ్ల ప్రాంతంలోనే మొయినాబాద్‌లో మూడు చోట్ల, చేవెళ్లలో ఆరు చోట్ల, శంకర్‌పల్లి, మోకిల పీఎస్‌ల పరిధిలో రెండు కేసులు ఉండడంతో రిమాండ్‌కు పంపించిన వారిని విచారణకు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దీంతో వారిని విచారించగా ఈ 11 కేసులతో పాటు ఇతర జిల్లాలోనూ కేసులు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈకేసులో పోలీసులకు సహకరించిన బాధితులు రిజ్వాన్, హైమద్, సాదత్‌లను పోలీసులు అభినందించారు. పరారీలో ఉన్న పది మందిని, మరో 20 శాతం సొత్తును త్వరలోనే రికవరీ చేస్తామన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ భవనాలకు డ్రా


లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలో తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన పది షాపింగ్ కాంప్లెక్స్ భవనాలకు కందుకూర్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డ్రా నిర్వహించారు. పది షాపులకు గాను, 70 మంది డీడీలు చెల్లించి ఆయా షాపింగ్ భవనాలకు తమకు నచ్చిన ధరను కోట్ చేస్తూ ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ పర్యవేక్షణలో, షాపుల వారీగా మొత్తం పది షాపులకు వరుసగా అత్యధిక ధర కోట్ చేసిన 10 మంది పేర్లను ప్రకటించారు. ప్రభుత్వం ఆయా భవనాలకు నెలకు నిర్దిష్ట అద్దె రూ.10 వేలు, జీఎస్టీ నిర్ణయించగా, పోటీలో పాల్గొన్న వారు రూ.20 వేలకు పైగా కోట్ చేసి షాపులను కైవసం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే

- మూడు గ్రామాల్లో వంద శాతం
- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ నవీన్



ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో కులగణన సర్వే పకడ్బందీగా సాగుతోందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ కె.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించి 110 ఎన్యుమరేటర్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి సర్వే చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 10,984 ఇళ్లను సర్వే(98.5 శాతం) పూర్తి చేశామన్నారు. ఉప్పరిగూడ, చర్లపటేల్‌గూడ, పోచారం గ్రామాల్లో వంద శాతం సర్వే పూర్తికాగా, మిగిలిన గ్రామాల్లో డోర్‌లాక్ ఉండటం, ఇతర ప్రాంతాలకు వెళ్లిన కుటుంబాలు ఉండటంతో సర్వేకు కొంత ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఈ నెల 30 లోపు కులగణన ఆన్‌లైన్ డేటా ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇంకా సర్వే చేయించుకోని కుటుంబాలు ఉంటే ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన 9849126460 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

బాధితురాలికి రూ.లక్ష పరిహారం


మహ్మద్ జియాన్, నిందితుడు

పహాడీషరీఫ్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎల్బీ నగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఉస్మాన్ నగర్‌కు చెందిన మహ్మద్ జియాన్ అలియాస్ మహ్మద్ ఉమర్(23) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించి అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష పరిహారం ప్రకటించారు.

ఆన్‌లైన్ మోసాలపై ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి బాధితుల నుంచి ఇబ్రహీంపట్నం పోలీసులకు సోమవారం రెండు ఫిర్యాదులు అందాయి. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం .. ఇబ్రహీంపట్నంకు చెందిన టి.వెంకటేశ్‌గౌడ్‌కు మీ కూతురు డ్రగ్స్ కేసులో పట్టుబడిందని సీబీఐ పేరుతో గుర్తుతెలియని అగంతకుడు ఫోన్ చేశాడు. అర్జెంట్‌గా రూ.30వేలు పంపాలని ఫోన్ పే నంబర్‌ను పంపించాడు. దీంతో అనుమానం వచ్చిన వెంకటేశ్ పోలీసులను ఆశ్రయించాడు. మరో కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన బి.రమేష్ క్రెడిట్ కార్డ్స్ నుంచి ఓటీపీలు వచ్చి రూ.96 వేలు కట్ అయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా మోసాపూరితమైన కాల్స్, సైబర్ నేరాలపై 1930 నెంబర్‌కు బాధితులు నేరుగా కాల్ చేయాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు.

ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

నిందితుడికి 20 ఏళ్ల జైలు

యాచారం: ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తికి సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించింది. యాచారం సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రా మానికి చెందిన వరికుప్పల మహేష్ ఈ ఏడాది మార్చి 13న గ్రామంలో తన పక్కింట్లో ఉండే ఓ ఐదేళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి ఇంటి పైకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యాచారం పోలీసు లు కేసు నమోదు చేసి మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతర ం పూర్తి వివరాలను జిల్లా కోర్టులో సమర్పించారు. విచారణ చేపట్టిన జిల్లా కోర్టు సోమవారం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కారు బీభత్సం



ప్రమాదానికి గురైన కారు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒక బెంజ్ కారు బీభత్సం సృష్టించింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం. ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని సిటీ సెంట్రల్ వైపు నుంచి రోడ్డునెంబర్-10 వైపు వెళ్తున్న బెంజ్ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల సాయంతో కారు నడుపుతున్న నజీర్ అనే వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించలేదని తేలింది. ప్రమాద సమయంలో కారు యజమానితో పాటు ఆయన భార్య కారులోనే ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో ఒక మహిళ ఈ ప్రమాదానికి పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సీసీ ఫుటేజీలను పరిశీలించి కారు ఎవరు నడుపుతున్నారనేది తేలుస్తామని పోలీసులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని బాలుడి మృతి


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: టిప్పర్ ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాంచందర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ జమాల్(14) బస్టాప్ ఎదుట నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొందుర్గు నుంచి షాద్‌నగర్ వైపు ప్రయాణిస్తున్న టిప్పర్ అతివేగంగా వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి లతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారిని చిదిమేసిన కారు

ఘటనా స్థలిలోనే మృతి చెందిన రెండేళ్ల బాలిక


బాలమ్మ (ఫైల్)

మీర్‌పేట: రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. ఉన్నంతలోనే తమ ముగ్గురు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటున్న తరుణంలో ఓ కారు ఆ దంపతులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన చిన్న తిరుపతయ్య, బాల వెంకమ్మ దంపతులు బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం నగరానికి వచ్చి భూపేష్‌గుప్తానగర్ వనపురి కాలనీ సమీపంలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. తిరుపతయ్య ఇంటింటికి తిరిగి గ్యాస్‌స్టవ్ రిపేర్లు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. చిన్న కుమార్తె తిరుమల బాలమ్మ(2) సోమవారం సాయంత్రం స్థానికంగా ఉండే పిల్లలతో కలిసి ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా కారుతో చిన్నారిని ఢీకొట్టి, తలపై నుంచి వెళ్లడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందింది. గమనించిన స్థానికులు కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

పేదలందరికీ నాణ్యమైన విద్య అందించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పేదలందరికీ నాణ్యమైన విద్యనందించాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అబ్దుల్ రెహమాన్, రాఘవేంద్ర ముదిరాజ్ డిమాండ్ చేశారు. పేద మధ్య తరగతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రెహమాన్, రాఘవేంద్ర ముదిరాజ్ మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ వరకు సంవత్సరానికి లక్ష రూపాయలు ఇవ్వాలని, ఉచితంగా వైద్యం అందజేయాలని, అర్హతలను బట్టి గౌరవ ప్రదమైన ఉపాధి కల్పించాలని, అర్హులందరికీ సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తులసిగారి రవీందర్, జిల్లా కన్వీనర్లు గంటల వెల్లి రాకేష్, గుండ్రపల్లి అమరేందర్, నాయకులు వంకేశ్వరం రమేష్, నర్సిరెడ్డి, భవాని శేఖర్, గజ్జల భాస్కర్, నరేష్, లింగస్వామి, స్టాలిన్, రవీంద్ర, శ్రీకాంత్, అశోక్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.